క్లుప్తంగా

నేటి నుంచి ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన పూజలు



పాన్‌గల్: మండలంలోని గోప్లాపూర్‌లో గురువారం నుంచి మూడు రోజుల పాటు సీతా రామాంజనేయ స్వామి, సత్యనారాయణ స్వామి విగ్రహా ప్రతిష్ఠ, ఆలయ ధ్వజస్తంభ ప్రతిష్ఠాపనోత్సవాలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. 5వ తేదీన మహాగణపతి పూజ, గోపూజ, యాగశాల, మండప పూజ, 6న రుద్ర పారాయణం, ఆవాహిత దేవతా పూజలు, రుద్రాభిషేకం, 7న విగ్రహాల ప్రతిష్ఠ, ధ్వజస్తంభ, బొడ్రాయి ప్రతిష్ఠ, అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. భక్తిశ్రద్ధలతో నిర్వహించే పూజల్లో భక్తులు, గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొని ఉత్సవాలను జయప్రదం చేయాలని కోరారు.

పైపులైన్ నిర్మాణంతో హర్షం



వీపనగండ్ల: మండలంలోని కల్వరాల మొదటి వార్డులో మినీ ట్యాంక్‌లు ద్వారా తాగునీరు సరఫరా అయ్యేందుకు అవసరమైన పైపులైన్ నిర్మాణం కోసం మంత్రి సహకారంతో నిధులు మంజూరయ్యాయని నాగర్‌కర్నూల్ జిల్లా పర్యాటక శాఖ అధికారి కల్వరాల నర్సింహ తెలిపారు. గతంలో ఉన్న మినీ ట్యాంక్‌కు నీటి సరఫరా లేక పరిసర గృహాల ప్రజలు ఇబ్బందులకు గురయ్యారన్నారు. దీంతో నూతనంగా పైపులైన్ ఏర్పాటు చేసి తాగునీటి సరఫరా చేయిస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో భగీరథ ఏఈ విశ్వనాథం, పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.

3 ఇసుక ట్రాక్టర్లు పట్టివేత



పాన్‌గల్: మండలంలోని చిక్కేపల్లికి చెందిన మూడు ఇసుక ట్రాక్టర్ల యజమానులపై కేసు నమోదైన ఘటన బుధవారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపిన వివరాల ప్రకారం.. మంగళవారం రాత్రి కానిస్టేబుళ్లు కేటీ మల్లేష్, మన్సూర్ పాన్‌గల్ ఎస్‌బీఐ సమీపంలో గస్తీ తిరుగుతుండగా ఈదమ్మ గుడి వైపు నుంచి ఇసుక లోడ్‌తో మూడు ట్రాక్టర్లు కనిపించడండతో వాటిని ఆపారు. ఇసుకు తరలింపునకు అనుమతులు ఉన్నాయా అని అడుగగా ఎలాంటి పత్రాలు చూపలేదు. దీంతో ఇసుక ట్రాక్టర్లను స్టేషన్‌కు తరలించి డ్రైవర్లు జలకంటి ఆంజనేయులు, మండ్ల మహేందర్, నాగరాజుపై బుధవారం కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

మహిళ అదృశ్యం

ఆత్మకూర్: పట్టణంలో నిర్వహిస్తున్న బొడ్రాళ్ల పండుగకు వచ్చిన ఓ మహిళ కనిపించకుండా పోయిందని కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ నరేందర్ తెలిపారు. మహబూబ్‌నగర్ ఓబ్లాయిపల్లికి చెందిన కుర్వతమ్మ ఆత్మకూర్‌లోని తన కుమార్తె వెంకటేశ్వరి ఇంటికి బొడ్రాళ్ల పండుగ కోసం వచ్చింది. ఈ నెల 1 న బయటకి వెళ్లి వస్తానని చెప్పిన ఆమె తిరిగి రాలేదన్నారు. ఆచూకీ తెలిసిన వారు ఆత్మకూర్ పోలీసులు, 87126 70631 నంబరుకు సమాచారం ఇవ్వాలని ఎస్‌ఐ కోరారు.

యువకుడు..

పాన్‌గల్: యువకుడు అదృశ్యమైన ఘటనపై బుధవారం కేసు నమోదైనట్లు ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపారు. ఎస్‌ఐ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని శాగాపూర్‌కు చెందిన పుట్టపాగ మహేష్ రెండేళ్లుగా చింతకుంటలో బేకరీ వర్కర్‌గా పనిచే స్తూ జీవనం సాగిస్తున్నాడు. గత నెల 30న స్నేహితుడు బాలకృష్ణకు సంబంధించిన బంధువులు మహేష్ సెల్‌ఫోన్ లాకున్నారు. అప్పటి నుంచి మహేష్ కనిపించడం లేదు. ఈ విషయంలో స్నేహితులు, బంధువుల ఇళ్ల వద్ద వెతికినా మహేష్ ఆచూకీ లభించలేదు. బుధవారం తల్లి చిట్టెమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

సత్తా చాటిన క్రీడాకారులు

ఆత్మకూర్: వేసవి శిక్షణ శిబిరాల్లో వివిధ క్రీడల్లో శిక్షణ పొందిన ఆత్మకూర్ విద్యార్థులు నారాయణపేట జిల్లా గుడుమాల్‌లో జరిగిన ఉమ్మడి జిల్లా స్థాయి వాలీబాల్ పోటీల్లో మొదటి, ద్వితీయ బహుమతులు సాధించారు. బుధవారం జరిగిన ఫైనల్లో అండర్ 12, అండర్ 14 విభాగాల్లో ఆత్మకూర్ విద్యార్థులు మొదటి, ద్వితీయ బహుమతులు సాధించినట్లు కోచ్ ఖాదర్ తెలిపారు. విద్యార్థులను సీనియర్ క్రీడాకారులు బాలు, అఫ్రోజ్, దివాకర్, తాండూర్ కిషోర్ అభినందించారు.

కానరాని ‘పల్లె వెలుగు’



బస్సు సౌకర్యం లేకపోవడంతో కేశంపేట నుంచి ఏదుట్లకు నడుచుకుంటూ వెళ్తున్న విద్యార్థులు (ఫైల్)



చెన్నూరు నుంచి గోపాల్‌పేటకు సైకిల్‌పై వస్తున్న విద్యార్థులు (ఫైల్)

- ఏళ్లు గడుస్తున్నా కాలినడకే దిక్కు
- బస్సు సౌకర్యం కల్పించాలని కోరుతున్న ప్రజలు
- విద్యార్థులకు తప్పని ఇబ్బందులు

గోపాల్‌పేట: తెలంగాణ రాష్ట్రం ఏర్పాటై 11 ఏళ్లు గడిచినా ఉమ్మడి గోపాల్‌పేట మండలంలో కొన్ని గ్రామాలకు ఇంకా బస్సు సౌకర్యం లేదు. దీంతో వారు అవసరాల కోసం ఇతర గ్రామాలు, పట్టణాలకు వెళ్లాలంటే ప్రధాన రోడ్డు వరకు కాలినడక వచ్చి బస్సు ఎక్కాల్సిన దుస్థితి. ఉదయం స్కూళ్లకు వెళ్లే సమయంలో పుస్తకాల మోతతో విద్యార్థుల కిలోమీటర్ల దూరం నడవాల్సి వస్తోంది. మరికొన్ని రోజుల్లో పాఠశాలలు తెరుచుకోనున్న నేపథ్యంలో విద్యార్థులకు బస్సు సౌకర్యం కల్పించాలని తల్లిదండ్రులు విజ్ఞప్తి చేస్తున్నారు.

ఇదీ పరిస్థితి

ఉమ్మడి గోపాల్‌పేట మండలంలో మున్ననూరు, తిర్మలాపూర్, చెన్నూరు గ్రామాలకు బస్సు సౌకర్యం లేదు. ప్రస్తుతం పొలికెపాడు గ్రామానికి ఉదయం సాయంత్రం బస్సు వెళ్తోంది కానీ అటు విద్యార్థులకు గాని ఇటు ప్రజలకు గానీ ఎటువంటి ప్రయోజనం కలగడం లేదని గ్రామస్తులు చెబుతున్నారు. ప్రజల సౌకర్యార్థం వనపర్తి నుంచి పెద్దకొత్తపల్లికి వయా పొలికెపాడు నైట్‌హాల్ట్ బస్సు నడపడం ద్వారా ఎనిమిది గ్రామాల ప్రజలకు బస్సు సౌకర్యం కల్పించినట్లవుతుందని అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. దీంతో తల్పునూరు, రేవల్లి, నాగపూర్, వెన్నచెర్ల, బండరావిపాకుల, పెద్దకొత్తపల్లి గ్రామాలకు మేలు జరుగుతుంది. అంతేకాకుండా కేశంపేట గ్రామానికి, కేశంపేట పాతతండా, కొత్తతండా గ్రామాలకు బస్సు సౌకర్యం లేదు. బస్సు సౌకర్యం లేకపోవడంతో చదువు మానేసిన విద్యార్థులు ఎంతో మంది ఉన్నారు. మూడేళ్ల క్రితం చెన్నూరు గ్రామానికి చెందిన కళాశాల విద్యార్థుల ఇబ్బందులు గమనించిన మాజీ మంత్రి ఎనిమిది మంది విద్యార్థులకు సొంతఖర్చుతో సైకిళ్లను కొనిచ్చారు.

నైట్ హాల్ట్ బస్సు నడపండి



పొలికెపాడు గ్రామానికి ప్రస్తుతం బస్సు నడుస్తోంది కానీ ప్రజలకు అనువైన సమయాల్లో రావడం లేదు. అలాగే వనపర్తి నుంచి పెద్దకొత్తపల్లి వయా పొలికెపాడు నైట్‌హాల్ట్ బస్సు నడిపిస్తే తమ గ్రామంతో పాటు రేవల్లి మండలంలోని పలు గ్రామాలకు సౌకర్యంగా ఉంటుంది. ప్రజాప్రతినిధులు సమస్యను గుర్తించి ప్రజల అవసరం మేరకు బస్సు సౌకర్యం కల్పిస్తే బాగుంటుంది.

– బలరాం, పొలికెపాడు

కొత్త బస్సులు వస్తే..

కొత్త రూట్లలో బస్సులు నడపాలని చాలా గ్రామాల నుంచి వినతులు వస్తున్నాయి. కానీ డిపోకు కొత్త బస్సులు రావడం లేదు. కొత్త బస్సులు వస్తే మేము ఏర్పాటు చేయిస్తాం. వచ్చిన బస్సులన్నీ పాత బస్సుల ప్లేసులోనే వస్తున్నాయి. అందువల్ల కొత్త రూట్లలో బస్సులు ఏర్పాటు చేయలేకపోతున్నాం. తొందర్లోనే కొత్త బస్సులు వచ్చే అవకాశం ఉందని ఉన్నతాధికారులు చెబుతున్నారు. అవి వస్తే కొత్త రూట్లకు బస్సులు నడుపుతాం.

– వేణుగోపాల్, వనపర్తి డిపో మేనేజర్

అభివృద్ధి చూసే కాంగ్రెస్‌లో చేరికలు

వనపర్తి రూరల్: పెబ్బేరు మండల కేంద్రంలోని 1వ వార్డుకు చెందిన 30 మంది బీఆర్‌ఎస్ నాయకులు, మహిళలు బుధవారం కాంగ్రెస్ నాయకుడు గధం ఉత్తంకుమార్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వనపర్తిలోని వారి స్వగృహంలో ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి వారికి పార్టీ కాండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కాంగ్రెస్ పార్టీ మహిళాభివృద్ధి, పేదల అభ్యున్నతి కోసం ప్రవేశపెట్టిన పథకాలకు ఆకర్షితులమై పార్టీలో చేరుతున్నట్లు వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో మార్కెట్ వైస్ చైర్మన్ విజయవర్ధన్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అక్కి శ్రీనివాస్‌గౌడ్, పట్టణ అధ్యక్షుడు వెంకట్రాములు, నాయకులు గంధం రాజశేఖర్, దయాకర్‌రెడ్డి, భానుప్రకాష్‌రెడ్డి, సురేందర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే మేఘారెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన నాయకులు

యువ వికాసం పేరిట యువతకు టోకరా



మాట్లాడుతున్న కుతుబ్

అమరచింత: రాజీవ్ యువవికాసం పథకం పేరిట నిరుద్యోగ యువకులను ప్రభుత్వం మోసగిస్తుందని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి కుతుబ్ మండిపడ్డారు. పట్టణంలోని శ్రీకృష్ణనగర్‌లో స్థానిక యువకులతో కలిసి రాజీవ్ యువవికాసం దరకాస్తుదారులను కలిసి వారి సమస్యలు తెలుసుకున్నారు. రూ.లక్ష రుణాలు ఇవ్వడానికి ఎక్కడా లేని నిబంధనలు పెట్టడం సరికాదన్నారు. రూ.3 నుంచి 4 లక్షల వరకు రుణాలు ఇస్తామన్న సర్కారు నేడు మాట మార్చి రూ.50 వేలు, రూ.లక్ష వరకే రుణాలు అందిస్తున్నామడం హస్యాస్పదంగా ఉందన్నారు. బ్యాంక్‌లో ఖాతాలు కలిగి లావాదేవీలు చేస్తూ సిబిల్ స్కోర్ ఉన్న వారికే రుణాలు మంజూరు చేస్తామని బ్యాంకర్లు చెప్పడం సరికాదన్నారు. దరకాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరికీ తక్షణమే రుణాలు ఇవ్వాలని, లేని పక్షంలో ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో అనురాగ్, చేతన్, ఆదర్శ్, తేజ, విశాల్ పాల్గొన్నారు.

వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలి



కొత్తకోటలో అవగాహన కల్పిస్తున్న కమిషనర్ సైదయ్య, సిబ్బంది

కొత్తకోట రూరల్: పట్టణంలో వీధి కుక్క కాటు, డెంగీ, మలేరియా వ్యాధులతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్ కమిషనర్ సైదయ్య సూచించారు. బుధవారం మున్సిపాలిటీ పరిధిలోని 13వ వార్డులో ప్రజలకు వ్యాధులపై అవగాహన కల్పించారు. ముఖ్యంగా పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే డెంగీ, మలేరియా వ్యాధుల బారిన పడకుండా ఉండొచ్చన్నారు.

పరిసరాలు శుభ్రంగా ఉంచాలి

వనపర్తి రూరల్: మండలంలోని చిట్యాల పంచాయతీ కార్యాలయాన్ని బుధవారం ఎంపీడీఓ రాఘవ సందర్శించి రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో తాగునీటి పైపులైన్ లీకేజీలు లేకుండా చూసుకోవాలని పంచాయతీ కార్యదర్శి పూర్ణచంద్రకు సూచించారు. వర్షాకాలంలో ప్రజలు రోగాల బారిన పడకుండా డ్రెయినేజీలను శుభ్రం చేయించి, బ్లీచింగ్ పౌడర్ చల్లించాలన్నారు.

పట్టణ అభివృద్ధికి సహకరించాలి

ఆత్మకూర్: మున్సిపాలిటీ అభివృద్ధికి 100 రోజుల కార్యచరణను రూపొందించి ముందుకెళ్తున్నామని, అందరూ భాగస్వామ్యం కావాలని కమిషనర్ చికినే శశిధర్ అన్నారు. బుధవారం స్థానిక మున్సిపాలిటీ పరిధిలోని ఏడో వార్డులో వార్డుల అధికారులు, సిబ్బందితో కలిసి పర్యటించారు. పారిశుద్ధ్యం, వనమహోత్సవం, ఇంకుడుగుంతల నిర్మాణాలు తదితర విషయాలపై పట్టణవాసులకు అవగాహన కల్పించారు.

‘జర్నలిస్టులకు ఉచిత వైద్య సేవలు అందించాలి’



డాక్టర్ పీజే బాబుకు వినతిపత్రం అందజేస్తున్న జర్నలిస్టులు

కొత్తకోట రూరల్: జిల్లాలోని వర్కింగ్ జర్నలిస్టులకు, కుటుంబాలకు ఉచిత ఓపీ సేవలు అందించడంతో పాటు వైద్య పరీక్షల్లో 50 శాతం, మందుల కొనుగోలుపై 25 శాతం రాయితీ ఇవ్వాలని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ పీజే బాబును బుధవారం వనపర్తి ప్రెస్ కమిటీ సభ్యులు కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ప్రెస్ క్లబ్ కమిటీ సభ్యులు మాట్లాడుతూ ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధులుగా పనిచేస్తున్న జర్నలిస్టులకు ఉచిత వైద్య సేవలను అందించి సహకరించాలని కోరారు. స్పందించిన డాక్టర్ పీజే బాబు త్వరలోనే జిల్లాలోని వైద్యులతో సమావేశం ఏర్పాటు చేసి జర్నలిస్టుల సమస్యలపై చర్చిస్తామన్నారు. కార్యక్రమంలో వనపర్తి ప్రెస్ కమిటీ సభ్యులు బొలేమోని రమేష్, కొండన్న యాదవ్, లక్ష్మణ్, ఖలీల్, యాదిరెడ్డి, గంధం దినేష్, కుమార్, తిరుపతి, శ్రీనాథ్, మల్లికార్జున్, పురుషోత్తం, తరుణ్, గోపాలకృష్ణ, పి.రవికుమార్, రాజు, రాజ్ కుమార్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

‘ఉపాధి’ ప్రణాళికలు రూపొందించాలి

వనపర్తి: జిల్లాలో జాతీయ ఉపాధి హామీ పథకానికి సంబంధించిన మెటీరియల్ కాంపోనెంట్ పనులకు త్వరగా గ్రౌండింగ్ చేసేందుకు కార్యాచరణ చేపట్టాలని కలెక్టర్ ఆదర్శ్‌సురభి ఆదేశించారు. బుధవారం ఐడీఓసీ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ లోకల్‌బాడీస్ ఇన్‌చార్జ్ యాదయ్యతో కలిసి ఉపాధి హామీ పథకం మెటీరియల్ కాంపోనెంట్ పనులపై సమీక్ష నిర్వహించారు. మెటీరియల్ కాంపోనెంట్ కింద వనపర్తి జిల్లాకు 23 నూతన గ్రామ పంచాయతీ భవనాలు, 11 కమ్యూనిటీ మరుగుదొడ్లు, 2 ప్లాస్టిక్ వేస్ట్ మేనేజ్మెంట్ యూనిట్లు, సెగ్రిగేషన్ షెడ్లు, కమ్యూనిటీ ఇంకుడు గుంతలు, స్వచ్ఛభారత్ కోష్ మంజూరయ్యాయన్నారు. స్థలం కేటాయింపు, పనుల పురోగతిని ఎంపీడీఓలు పర్యవేక్షించాలని ఆదేశించారు.

వన మహోత్సవం

వన మహోత్సవంలో భాగంగా గ్రామ పంచాయతీ ప్రధాన రహదారికి 200 చొప్పున అందమైన మొక్కలు నాటేందుకు కార్యాచరణ ప్రారంభించాలని సూచించారు. ఈ సంవత్సరం జిల్లాలో 44 కొత్త నర్సరీలు ప్రారంభించేందుకు లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు.

ఇందిరమ్మ ఇళ్లు

ప్రతి మండలంలో ఒక పంచాయతీని పైలెట్ ప్రాజెక్టుగా తీసుకొని మొదటి విడతలో మంజూరయిన ఇందిరమ్మ ఇళ్లు త్వరగా గ్రౌండింగ్ చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓలను ఆదేశించారు. ఇందిరమ్మ ఇళ్లకు డబ్బులు సైతం వెనువెంటనే ఖాతాలో జమ చేస్తున్నామని లబ్ధిదారులకు అవగాహన కల్పించాలన్నారు.

రేపు ప్రపంచ పర్యావరణ దినోత్సవం

ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం అన్ని మండలాలు, మున్సిపాలిటీలో ప్లాస్టిక్ వాడకం అరికట్టడం, పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్ కార్యనిర్వాహక ఇంజినీరు మల్లయ్య, ఎంపీడీఓలు, ఎంపీఓలు తదితరులు పాల్గొన్నారు.

అధిక దిగుబడులు సాధించడమే లక్ష్యం

ఆత్మకూర్: రైతులు పంటల సాగులో అధిక దిగుబడులు సాధించడమే లక్ష్యంగా ముందుకెళ్తున్నట్లు పాలెం పరిశోధన కేంద్రం శాస్త్రవేత్తలు డాక్టర్ రాంరెడ్డి, డాక్టర్ విజయలక్ష్మి అన్నారు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమంలో భాగంగా వ్యవసాయశాఖ, హార్టికల్చర్, వెటర్నరీ శాఖల ఆధ్వర్యంలో బుధవారం ఆరేపల్లి రైతు వేదికలో అధిక సాగుబడులు సాధించేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు అవగాహన కల్పించారు. రైతులు నాణ్యమైన విత్తనాలు ఎంపిక చేసుకోవాలని, పచ్చిరొట్టె ఎరువులను వాడాలని, వరి కొయ్యలను పొలంలోనే దున్ని నేలసారాన్ని పెంచాలని సూచించారు. అలాగే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కా ర్యక్రమంలో ఏఓ వినయ్‌కుమార్, పీఏసీఎస్ చైర్మన్ లక్ష్మీకాంత్‌రెడ్డి, మాజీ సర్పంచ్ యుగంధర్‌రెడ్డి, ఏఈఓలు సంతోష, ఝాన్సీ, రైతులు పాల్గొన్నారు.

మహాసభలను విజయవంతం చేయాలి

వనపర్తి రూరల్: తెలంగాణ భవన ఇతర నిర్మాణ కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేయాలని ఆ సంఘం (సీఐటీయూ అనుబంధం) అధ్యక్షుడు జి బాలస్వామి కోరారు. ఆయన అధ్యక్షతన బుధవారం జిల్లా కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో పట్టణ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన సీఐటీయూ జిల్లా కార్యదర్శి పుట్ట ఆంజనేయులు మాట్లాడుతూ ఈ నెల 8న జరిగే భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో గంధం రాబర్ట్, నందిమళ్ల రాములు, శ్రీనివాసులు, విజయ్‌కుమార్, భాస్కర్, బాలపీరు, వెంకటయ్య పాల్గొన్నారు.

కేతేపల్లిలో కొండచిలువ కలకలం

పాన్‌గల్: మండలంలోని కేతేపల్లి ఎస్సీ కాలనీలో మంగళవారం రాత్రి కొండచిలువ కలకలం రేపింది. కాలనీలో కొండ చిలువను చూసి కాలనీవాసులు ఒక్కసారిగా భయాందోళనకు గురయ్యారు. చల్లటి వాతావరణం, కప్పలు కోసం ఇంటి పరిసరాలకు కొండచిలువ వచ్చినట్లు కాలనీవాసులు అనుమానం వ్యక్తం చేశారు. కాలనీలో కనిపించిన కొండ చిలువను అందరూ కలిసి చంపినట్లు వారు పేర్కొన్నారు. వర్షాకాలం కావడంతో ప్రతి ఒక్కరూ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే విష పురుగులు రాకుండా ఉంటాయని పలువురు వాపోయారు.



కాలనీవాసులు చంపిన కొండచిలువ

ప్రభుత్వ పాఠశాలలను కాపాడుకుందాం

వనపర్తి విద్యావిభాగం: ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యనందించి, విద్యార్థుల బంగారు భవిష్యత్‌కు పునాదులు వేద్దామని వనపర్తి డీఈఓ అబ్దుల్ ఘని అన్నారు. బుధవారం టీఎస్ యూటీఎఫ్ వనపర్తి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన బడిబాట ప్రచారజాతను డీఈఓ ప్రారంభించారు. ఈ సందర్భంగా డా.బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రభుత్వ పాఠశాలలో ఉచితంగా పాఠ్య, నోటు పుస్తకాలు, నాణ్యమైన భోజనం అందిస్తున్నామని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రచారజాతా పాన్‌గల్, వీపనగండ్ల, శ్రీరంగాపూర్, పెబ్బేరు, కొత్తకోట మండలంలో పర్యటించి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో ఏఎంఓ మహానంది, టీఎస్ యూటీఎఫ్ జిల్లా నాయకులు జ్యోతి, వెంకటేష్, అరుణ, శ్రీనివాస్‌గౌడ్, హమీద్, తిమ్మప్ప, మురళి, సూరయ్య తదితరులు పాల్గొన్నారు.



ప్రచారజాతాను ప్రారంభిస్తున్న డీఈఓ అబ్దుల్ ఘని

వైభవంగా గ్రామదేవతల ప్రతిష్ఠాపనోత్సవాలు



ఆత్మకూర్‌లో పూజల్లో పాల్గొన్న భక్తులు

ఆత్మకూర్: పట్టణంలో నూతనంగా నిర్మించిన పోశమ్మ, కట్టెమ్మ, లింగమయ్య, కోటమైసమ్మ, కట్టమైసమ్మ, భూలక్ష్మమ్మ, బొడ్రాళ్ల ప్రతిష్ఠాపన మహోత్సవ పూజలు అంగరంగ వైభవంగా కొనసాగుతున్నాయి. బుధవారం ఉదయం నుంచి ప్రాతః పూజలు, గణపతి, నవగ్రహ, వాస్తుహోమం, అధివాసంగ హోమం, చండీహోమం, మహాస్నపనం, చదుష్పదబలి, మంగళహారతి, తీర్థప్రసాద వితరణ భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉత్సవమూర్తుల విగ్రహాలను ప్రత్యేక పూజల అనంతరం జలాధివాసం నిర్వహించారు.

నేడు విగ్రహాల ప్రతిష్ఠాపన

గురువారం స్వస్తిశ్రీ విశ్వావసు నామసంవత్సరం జ్యేష్ఠ శుద్ధ దశమి ఉదయం 5 గంటల నుంచి ప్రాతఃపూజలు, గర్తన్యాసములు, ప్రతిష్ఠాంగహోమం, ఉదయం 7.56 గంటలకు మంత్రప్రతిష్ఠ, విగ్రహాల ప్రతిష్ఠ, ప్రాణప్రతిష్ఠకక్షజ్వాల, మహాపూర్ణాహుతి పూజ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు అర్చకులు తెలిపారు.

అమరచింత: మండలంలోని మిట్టనందిమళ్లలో ధ్వజస్తంభ ప్రతిష్ఠ మహాపూజ కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. బుధవారం తెల్లవారుజాము నుంచి పాటిమీది ఆంజనేయస్వామి ఆలయంలో వేద పండితుల సమక్షంలో హోమం చేశారు. దేవతా మూర్తుల విగ్రహాలకు జలాధివాసం, ధాన్యాధివాసం కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గురువారం ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన కార్యక్రమం వైభవంగా చేపడుతున్నట్లు వెల్లడించారు.



మిట్టనందిమళ్లలో ధ్వజస్తంభానికి పూజలు చేస్తున్న భక్తులు

రెవెన్యూ సదస్సుల నిర్వహణపై ప్రచారం చేయాలి

సాక్షి, నెట్‌వర్క్: జిల్లావ్యాప్తంగా భూ భారతి రెవెన్యూ సదస్సులు నిర్వహించే గ్రామాల్లో ముందుగానే ప్రచారం చేసి, రైతులు అధిక సంఖ్యలో పాల్గొనేలా చూడాలని కలెక్టర్ ఆదర్శ్‌సురభి అధికారులను ఆదేశించారు. రైతుల నుంచి స్వీకరించిన దరఖాస్తులకు వీలైనంత త్వరగా పరిష్కారం చూపాలన్నారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సందర్భంగా ఆయన బుధవారం జిల్లాలోని వివిధ గ్రామాల్లో నిర్వహిస్తున్న సదస్సులను పరిశీలించారు.

❖ వనపర్తి మండలం అంకూర్, పెద్దమందడి మండలం బలిజపల్లి గ్రామాల్లో నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను కలెక్టర్ సందర్శించి, భూ రికార్డులు, దరఖాస్తులను పరిశీలించారు.

రికార్డులు సక్రమంగా నిర్వర్తించాలి

జిల్లాలోని అన్ని చౌకధర దుకాణాల్లో బియ్యం రికార్డులు సక్రమంగా నిర్వహించాలని కలెక్టర్ డీలర్లకు ఆదేశించారు. బుధవారం వనపర్తి మండలంలోని అంకూర్, పెద్దమందడి మండలంలోని జంగమయ్యపల్లి పంచాయతీల్లోని చౌకధర దుకాణాలను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టాక్ రిజిస్టర్ నిర్వహించకపోవడంపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కలెక్టర్ వెంట ఆర్డీఓ సుబ్రహ్మణ్యం, వనపర్తి తహసీల్దార్ రమేష్‌రెడ్డి, పంచాయతీ సెక్రటరీ తదితరులు ఉన్నారు.

❖ పాన్‌గల్ మండలంలోని వెంగళాయిపల్లిలో తహసీల్దార్ సత్యనారాయణరెడ్డి, దావాజిపల్లిలో డీటీ అశోక్‌కుమార్ ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. వెంగళాయిపల్లిలో 11, దావాజిపల్లిలో 18 దరఖాస్తులు వచ్చినట్లు వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆర్‌ఐలు తిరుపతయ్య, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

❖ ఖిల్లాఘనపురం మండలంలోని ఆగారం, వెంకటాంపల్లిలో తహసీల్దార్ సుగుణ, డిప్యూటీ తహసీల్దార్ లక్ష్మీకాంత్ రైతుల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ఆగారంలో 5, వెంకటాంపల్లిలో 10 దరఖాస్తులు వచ్చాయన్నారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ కురుమూర్తి, ఆర్‌ఐ తిరుపతయ్య, లక్ష్మి, ఓంప్రకాష్, శివలీల పాల్గొన్నారు.

❖ వనపర్తి మండలంలోని అంకూర్‌లో తహసీల్దార్ రమేష్‌రెడ్డి 33, అప్పాయిపల్లిలో డిప్యూటీ తహసీల్దార్ చక్రపాణి 13 దరఖాస్తులు స్వీకరించారు.

❖ పెబ్బేరు మండలంలోని రంగాపురంలో తహసీల్దార్ మురళీగౌడ్ 32, కంచిరావుపల్లిలో డిప్యూటీ తహసీల్దార్ నందకిషోర్ 14 దరఖాస్తులు స్వీకరించారు.

❖ శ్రీరంగాపురం మండలంలోని వెంకటాపురంలో తహసీల్దార్ రాజు ఆధ్వర్యంలో నిర్వహించిన సదస్సులో 20 మంది దరఖాస్తులు సమర్పించారు. కార్యక్రమంలో ఆర్‌ఐలు కె మధు, వెంకటేష్, రాధాకృష్ణ, రాఘవేంద్రరావు తదితర సిబ్బంది పాల్గొన్నారు.

❖ ఏదుల మండలంలోని మాచుపల్లిలో 102 దరఖాస్తులు స్వీకరించినట్లు తహసీల్దార్ మల్లికార్జున్ తెలిపారు. రేవల్లి మండలంలోని కేశంపేటలో 79 దరఖాస్తులు వచ్చాయని తహసీల్దార్ లక్ష్మీదేవి తెలిపారు.

❖ ఆత్మకూర్ మండలంలోని పిన్నంచర్ల, బాలకిష్టాపూర్ గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించగా 18 దరఖాస్తులు వచ్చాయని తహశీల్దార్ షేక్ చాంద్‌పాషా తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌ఐ చంద్రశేఖర్, సర్వేయర్ సురేష్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



బలిజపల్లిలో రైతుతో మాట్లాడుతున్న కలెక్టర్ ఆదర్శ్‌సురభి



రంగాపురంలో దరఖాస్తులు స్వీకరిస్తున్న తహసీల్దార్ మురళీగౌడ్